క్లుప్తంగా

లక్ష పుష్పార్చన



గోపాల్‌పేట: మండలంలోని ఏదుల ఎర్రగట్టు ఆలయంలో ఆలయ ధర్మకర్త, సర్పంచ్ నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశేష పూజా పర్వాలను పాంచరాత్రిగమ శాస్త్రరీతిలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించి వేదికపై తీర్చిదిద్దారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అర్చకస్వాములు యజ్ఞాచార్యులు, సుదన్వాచార్య స్వామి, చైతన్యస్వాముల ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి, పవిత్ర మూలల విస్తరణ, 108 కలశాలతో మూల మూర్తులందరికీ అభిషేకం, యజ్ఞం జరిపించారు. పూజల్లో మహేష్, తిరుమల, అనురాధ, యెలిశెట్టి శ్రీధర్, అనురాధ దంపతులు, ఈఓ ఆంజనేయులు అర్చకస్వాములు పాల్గొన్నారు.

సవారమ్మ పండుగ



చిన్నంబావి: మండలంలోని పెద్దదగడలో గ్రామ దేవత సవారమ్మ పండగను గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మేకలు, కోళ్లు బలిచ్చి, కొబ్బరికాయలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ సింగ్, ఎంపీటీసీ పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జీవేశ్వరస్వామి పూజలు



ఆత్మకూర్: సాకుల సాలి కులస్తుల ఆరాధ్య దైవం జీవేశ్వరస్వామి జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో జీవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హోమం, అభిషేకం, భజన తదితర పూజా కార్యక్రమాలు ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిందె దశరథ్‌రావు, విఠల్‌రావు, మీనాబాయ్, కృష్ణయ్య, సందీప్, విశ్వనాథ్, విష్ణురామ్, జిందె శ్రీను, జ్యోతి, జిందె గోపి, మనీషా, జిందె మురళి, అన్నపూర్ణ, సక్కుబాయి, విఠాబాయి పాల్గొన్నారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక



పెబ్బేరు రూరల్: కేరళలోని త్రివేండ్రంలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో నిర్వహించే సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ (కియా) పోటీలకు పెబ్బేరు మాస్టర్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు మంగళవారం పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు ట్వింకిల్‌రెడ్డి, చందన, నాగజయశ్రీ ని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

లారీ, వాటర్ ట్యాంకర్ ఢీ

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై లారీ, వాటర్ ట్యాంకర్ ఢీ కొట్టుకోవడంతో చాంద్‌పాషా, బాలయ్యకు గాయాలయిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్ చాంద్‌పాషా గోపాల్‌పేట నుంచి లారీలో పలుగు రాళ్లు వేసుకొని చెన్నై వైపు వెళ్తుతున్న క్రమంలో జాతీయ రహదారి పక్కన మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంక్‌ను ఢీ కొట్టడంతో ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్ చాంద్‌పాషకు కాళ్లు విరిగి తీవ్రగాయాలు కావడంతో పాటు మొక్కలకు నీళ్లు పడుతున్న బాలయ్యకు గాయాలు కాగా ఇద్దరిని కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స నిమిత్తం హైవే సూపర్‌వైజర్ విజయ్‌తో ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు.

కనుల పండువగా పోచమ్మ బోనాలు

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట, రాంరాయనిపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం పోచమ్మదేవత బోనాల పండుగను కనుల పండువగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, వేపాకు తదితర వాటితో అందంగా అలంకరించిన బోనాలలో అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని మహిళలు ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి పాటలు పాడుతుండగా కొందరు మహిళలు పూనకంతో ఊగిపోయారు. అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో భక్తులు ప్రదక్షణలు చేసి నైవేద్యం సమర్పించారు. మరి కొందరు కోళ్లు, గొర్రె పొటేళ్ల అమ్మవారి ముందు కోసి మొక్కులు తీర్చుకున్నారు. మానాజీపేటలో గొర్రె పొటేళ్లతో తయారు చేసిన రథంపై అమ్మవారి బోనం తీసుకొచ్చారు. పోతురాజులు, పూనకాలు వచ్చిన మహిళలు, బోనాలతో పండుగ వైభవంగా జరిగింది.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు రేమద్దుల, కేతేపల్లి, దావాజిపల్లి, బహుదూర్‌గూడెం, బుసిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవిత, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, మంజుల, అనిత, వెంకటయ్యయాదవ్, విష్ణునాయుడు, సింధూజ, ఎంపీటీసీలు హైమావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కేతేపల్లిలో బోనాల ఉత్సవాలల్లో ఏఐసీసీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వీపనగండ్లలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని మర్రికుంటలో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ప్రత్యేకంగా అలంకరించిన బోనపు కుండలో తయారు చేసిన వంటకాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దగూడెంలో..

వనపర్తి మండలంలోని పెద్దగూడెంలో మహిళలు పోచమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండన్న, ఎంపీటీసీ, ఉపసర్పంచ్ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని కంచిరావుపల్లిలో బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట్లో ఆడపచులు గ్రామ దేవతలైన అమ్మవారికి బోనం కుండను కుంకుమ, పసుపుతో అలంకరించి డప్పులతో ఊరేగింపుతో తీసుకెళ్లి అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శనలు చేసి నైవేద్యం సమర్పించారు. అలాగే అమ్మవారికి పొట్టేళ్లు, కోళ్లు కోసి మొక్కులు చెల్లించుకున్నారు. అందరిని చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

నాగరాలలో..

శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో మహిళలు డప్పు వాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా బోనాలతో ఊరేగింపు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో మహిళలు మంగళవారం పోచమ్మ దేవతకు ఘనంగా బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలను ఎత్తుకుని పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



మానాజీపేటలో గొర్రె పొటేళ్ల రథంపై అమ్మవారి బోనం తీసుకొస్తున్న భక్తులు



పాన్‌గల్‌లో బోనాలతో మహిళలు



పెద్దగూడెంలో..



రాంరాయనిపల్లిలో..

రాష్ట్రపతి నిలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



వనపర్తి టౌన్: సికింద్రాబాద్‌లో గల రాష్ట్రపతి నిలయంలో వనపర్తి బాలభవన్ చిన్నారుల నృత్య ప్రదర్శనకు అవకాశం దక్కింది. ఈ మేరకు మంగళవారం కూచిపూడి శిక్షకురాలు బక్షి లక్ష్మీప్రసన్న నేతృత్వంలోని చిన్నారుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ప్రదర్శనలో వనపర్తి బాలభవన్ విద్యార్థులు ఆకర్ష, స్మైలీ, సింధు, సాయిప్రణవి, నిత్య, సంజన ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మంగళవారం తెలుగు భాష దినోత్సవం, గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పెబ్బేరు: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 455, 456లో డాక్యుమెంట్స్ టాంపరింగ్ చేసి అక్రమ వెంచర్ వేసిన నరేష్‌కుమార్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. పట్టణానికి చెందిన రైతు నరసింహారెడ్డి భూమి డాక్యుమెంట్లు టాంపరింగ్ చేసి అక్రమంగా వెంచర్ వేయడంతో పాటు భూమిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్న రాజాగౌడ్, మధుసూదన్‌గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, గోనెల ఎల్లయ్యపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు తహసీల్దార్ పాండునాయక్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ మాట్లాడుతూ ఖిల్లాఘనపురం మండల కేంద్రం వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాలకు ఎటు వెళ్లాలన్నా కనీసం 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. నాయకులు 20ఏళ్ల నుంచి ఎన్నికల సమయంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు హామీలు ఇచ్చినా.. ఎన్నికలు పూర్తి కాగానే హామీని అటకెక్కిస్తున్నారని మండిపడ్డారు. అందుబాటులో కళాశాల లేకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, ఆశన్న, సుంకరి అంజనేయులు, శివశంకర్, రాంచంద్రి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే నిర్మించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయకార్యదర్శి రాఘవ మాట్లాడుతూ మండలంగా ఏర్పడినా ఇప్పటి వరకు కళాశాలను మంజూరు చేయకపోవడం శోచనీయం అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రతి విద్యా సంవత్సరం 600 మందికి పైగా విద్యార్థులు ఇంటర్ చదువుల కోసం మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, ఆత్మకూర్ లాంటి పట్టణాలకు వలస వెలుతున్న పరిస్థితులు దాపరించాయన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కళాశాల కోసం స్థలం కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



ఖిల్లాఘనపురం తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ పాలన

ఆత్మకూర్: కేంద్రంలో బీజేపీ రాక్షస పాలన కొనసాగుతుందని, రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి 700 మంది రైతుల చావుకు ప్రధాని మోదీ కారణమయ్యారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర గిడ్డంగుల చైర్‌పర్సన్ రజనిసాయిచంద్‌తో కలిసి 758 మంది లబ్ధిదారులకు పెరిగిన పింఛన్ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని చేపట్టిన నిరసనలో మృతిచెందిన 700మంది రైతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్థిక సహాయం అందించి రైతులకు దేవుడయ్యాడని గుర్తుచేశారు. రాష్ట్రంలో 5.11లక్షల దివ్యాంగులకు రూ. 3016 ఉన్న పెన్షన్‌ను రూ. 4016 కు పెంచి తక్షణమే అమల్లోకి తీసుకొచ్చారని కొనియాడారు. కులవృత్తులను నమ్ముకున్న వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందించి వారి అభ్యున్నతికి తోడ్పడుతుందన్నారు

కాంగ్రెస్, బీజేపీ గుణపాఠం

రానున్న ఎన్నికల్లో మత కల్లోలాలు సృష్టిస్తున్న బీజేపీకి, అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని, రైతులకు రూ.లక్ష రుణమాఫీ, రైతుబంధు పథకం, 24గంటల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు పండించిన పంటలను సైతం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్ పాల్గొన్నారు.

అమరచింత: కురుమ, యాదవులను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలన్న సంకల్పంతంలో సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులకు మంజూరైన ఆరు యూనిట్ల గొర్రెలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడం, సంక్షేమ పథకాలను వర్తింప చేయడం వంటి కార్యక్రమాలను విస్తృత పరిచి ప్రతి కుటుంబానికి ఆర్థికంగా భరోసా అందించేందుకు సీఎం కేసీఆర్ తపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మార్క సరోజ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, జింక రవి, షానవాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాలను క్లాస్‌మెట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన జీకే టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు నగదు ప్రోత్సాహకాలు అందించారు. బహుమతులు అందించిన క్లాస్‌మెట్ క్లబ్ ప్రతినిధి సుధాకిరణ్, రవిప్రకాష్ కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధ, క్లబ్ ప్రతినిధి మేరెడ్డి రవిప్రకాష్, మండల అధ్యక్షుడు విశ్వనాథం, నవీన్, రాఘవేందర్, మానాజీపేట పాఠశాల హెచ్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కుర్మయ్య, ఉపాధాయులు, విద్యార్థులు మంగళవారం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.



దుప్పల్లిలో క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ పద్మావతి

కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, కవిరాజు గౌడ్, చైతన్యకుమార్, నాగేంద్రంగౌడ్, విజయుడు, ఎల్లస్వామి, నిరంజన్, కృష్ణవేణి, పాల్గొన్నారు.

మదనాపురం: క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఎంపీపీ పద్మావతి, ఎంఈఓ కృష్ణయ్య ప్రారంభించారు. ఈసందర్భం వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అండర్17 బాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా పరిషత్, దుప్పల్లి పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. అనంతరం విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రాలను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ చాంద్‌పాషా, హెచ్‌ఎంలు నిర్మలాదేవి, మూలే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



గోపాల్‌పేట: వరి, పత్తి పంటల్లో చీడపీడలు, యాజమాన్య పద్ధతులపై రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవడం ద్వారా పంట దిగుబడి పెరిగి అధిక లాభాలు పొందేందుకు అవకాశం ఉంటుందని మదనాపురం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని రైతువేదికలో గోపాల్‌పేట, చాకల్‌పల్లి, ఏదుట్ల, మున్ననూరు, బుద్ధారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో అక్కడక్కడ కొనలు ఎర్రబడి చనిపోవడం గమనించామన్నారు. నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గోపాల్‌పేట సర్పంచ్ శ్రీనివాసులు, రైతుబంధు కోఆర్డినేటర్ మన్యంనాయక్, ఉమ్మడి మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేరు రూరల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ అగ్రవర్ణాలే అధికారం చలాయిస్తున్నాయని ధర్మ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మహరాజ్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో రెండో ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 14వ రోజుకు చేరింది. జిల్లా ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాలు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో వారికి ప్రాధాన్యం లేకుండా చేశారని విమర్శించారు. ఉన్నత ఉద్యోగాలల్లో అగ్రవర్ణాల వారు ఉంటే ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు తదితర చిన్నాచితక ఉద్యోగాలతోనే బడుగు బలహీనవర్గాలు నెట్టుకొస్తున్నారని దుయ్యబట్టారు. 16 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న వారిని పరీక్షలు రాస్తేనే క్రమబద్ధీకరిస్తామనడం అన్యాయం అన్నారు. శాఖకో విధానం ఏంటని ప్రశ్నించారు. ఏఎన్‌ఎంలు 14 రోజుల నుంచి పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. డిమాండ్లు నేరేవేరే దాకా పోరాటం కొనసాగించాలని ఏఎన్‌ఎంలను కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లయ్య

సమ్మెకు మద్దతు ఇవ్వండి

రెండో ఏఎన్‌ఎంల ఉద్యోగాల క్రమబద్ధీకరణ పోరాటానికి మద్దతు ఇవ్వాలని మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, పట్టణ కార్యదర్శి రమేష్, తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు నందిమల్ల రమేష్‌ను వారి వారి పార్టీ కార్యాలయంలో కలసి వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తామని సీఎం మాట ఇచ్చి తప్పారని, వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యదర్శి లక్ష్మమ్మ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



కొత్తకోటలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్‌గౌడ్



మదనాపురంలో మాట్లాడుతున్న జీఎంఆర్

కొత్తకోట రూరల్: జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు రెచ్చిపోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ హితువు పలికారు. మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ మాజీ మంత్రి చిన్నారెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, చిన్నారెడ్డిని విమర్శించే స్థాయి గట్టుయాదవ్‌కు లేదని ఎద్దేవా చేశారు. 41మంది ఎమ్మెల్యేలతో ప్రత్యేక తెలంగాణ నినాదాన్ని ఢిల్లీకి చేరవేసిన ఘనత చిన్నారెడ్డికే దక్కిందన్నారు. చిన్నారెడ్డిపై అనుచిత మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో బీఆర్‌ఎస్ నేతల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొగిలిసత్యారెడ్డి, పెంటన్నయాదవ్, న్యాయవాది త్రినాథ్, శ్రీనివాస్, మన్యం, బాలరాజు, జగదీశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మదనాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను హర్షిస్తూ అంబేడ్కర్, మల్లికార్జున్‌ఖర్గే చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం చేవెళ్ల ప్రజా గర్జన బహిరంగ సభలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రాత్మకం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జెల నాగన్న, జగదీశ్, వడ్డె కృష్ణ, బాలు, అంజాద్ అలీ, ఖాజామైనోద్దీన్ పాల్గొన్నారు.

కొత్తకోట: రాష్ట్రంలోని దళిత, గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. చేవెళ్ల బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే దళిత, గిరిజనుల డిక్లరేషన్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం కొత్తకోట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రదీప్‌కుమార్‌గౌడ్ పాలాభిషేకం చేశారు.



పెద్దమండడిలో

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మహేష్, అంజద్‌అలీ, అక్బర్, బాలచందర్, రాఘవేందర్, ప్రవీన్‌కుమార్, మోహన్‌నాయక్, బాలరాజు, శివుడు, వడ్డె కృష్ణ తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

ఆత్మకూర్/అమరచింత: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం.నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో చంబల శ్రీకాంత్‌గౌడ్, భరత్‌గౌడ్, అంజేయులుగౌడ్, పల్లె రామచంద్రయ్యగౌడ్, అశోక్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

వీపనగండ్ల: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలపై మంగళవారం గోవర్ధనగిరిలో నాయకులు గడప గడపకు కాంగ్రెస్ పార్టీ పేరుతో విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రైతు రుణమాఫీని ఏకకాలంలో చేస్తుందని మండల అధ్యక్షుడు బీరయ్య అన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, బాల్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వనపర్తి టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాములు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.